ముగ్గురికి కరోనా పాజిటివ్

సుభాష్‌నగర్, జనవరి 12: జిల్లాలో మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి వచ్చిన ముగ్గురు ఔట్ పేషంట్లకు కరోనా పరీక్షలు నిర్వహించగా వారికి పాజిటివ్ నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో జేఎన్1 వేరియంట్ కేసులు నమోదు అవుతున్నందున ప్రజలు మాస్కులు ధరించాలని కోరారు.

సంక్రాంతికి ఊరెళుతున్నారా!

- దొంగలున్నారు జాగ్రత్త
- దొంగతనాల నియంత్రణకు పోలీసుల సూచనలు

కరీంనగర్ క్రైం, జనవరి 12: సంక్రాంతి పండుగ వేళ పాఠశాల, కళాశాలలకు సెలవులు ప్రకటించ డంతో పట్టణాల నుంచి ప్రజలు, విద్యార్థులు వారి వారి స్వస్థలాలైన గ్రామాలకు తరలిపోతున్నారు. పట్టణాలలో ఇంటికి తాళంవేసి ఊర్లకు వెళుతుండటంతో చోరీలు జరిగే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఇంటికి తాళం వేసి ఊరువెళుతున్న వారికి వారి ఇళ్లల్లో చోరీ జరగకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ పోలీసులు కొన్ని జాగ్రత్తలు, సూచనలతో కూడిన కరపత్రాలను ముద్రించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. మరో వైపున మైక్‌లలో కూడా ప్రచారం చేస్తున్నారు. పోలీసుల సూచనలు కొన్ని..



- దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీస్ ఠాణా అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేసుకొని ఊరేళ్లిన వారి ఇళ్లపై బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ పోలీసులు నిఘా ఏర్పాటు చేస్తారు
- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం క్షేమం. ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి.
- ఊరు వెళుతున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు.
- బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసు కెళ్లాలి.
- గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి.
- వాచ్‌మన్ లేదా సీసీ కెమెరాలు ఏర్పా టు చేసుకోవడం మంచిది
- అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ లేదా దగ్గరలో ఉన్న పోలీసు ఠాణాలో సమాచారం ఇవ్వాలి.
- లగేజీ ప్యాక్ చేసేశాం, మేం ఊరికి బయలుదేరుతున్నాం.. అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడం లాంటి పిచ్చి పనులు అస్సలు చేయవద్దు.
- మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, పేపర్, పాలప్యాకెట్లు ఉండకుండా చూడాలి. అవి గమనిస్తే ఇంట్లో ఎవరూ లేరని దొంగతనాలు చేస్తారని గుర్తుంచుకోండి.
- నమ్మకమైన ఇరుగు పొరుగు వారికి మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండాలని చెప్పడం బెటర్.
- బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్ లకు, గుడికి వెళ్లేటప్పుడు తగిన జాగ్రతలు తీసుకోండి.

కేంద్రం నిధులు ఇచ్చినా పనుల్లో జాప్యం

- ఎంపీ బండి సంజయ్‌కుమార్
- ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం

చిగురుమామిడి, జనవరి 12: కేంద్రం నిధులు ఇచ్చినా అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్లపై ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఇందుర్తిలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులతో పాటు ఎంపీ ప్రతిజ్ఞ చేశారు. గ్రామ సర్పంచ్ అందె స్వరూప-స్వామి, ఎంపిటిసి కోమటిరెడ్డి చంద్రకళరెడ్డి-రాంగోపాల్‌రెడ్డిలు ఎంపీని ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి జీవనజ్యోతి, సురక్షా బీమా, ఆయుష్మాన్ భారత్ పథకంతో పాటు అనేక రకాల నిధులను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా ఉచితంగా గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాం ద్వారా బియ్యం అందిస్తున్నామని అన్నారు. సకాంలో నిధులు మంజూరు చేసినా అధికారులు పనుల పట్ల నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లిస్తారని అధికారులను, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. రహదారులు, మౌళిక సదుపాయాల నిధుల ద్వారా కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి 600 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు 219 కోట్ల రూపా యల నిధులు ప్రత్యేకంగా మంజూరు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడితో పనుల్లో జాప్యం చేస్తున్నా రన్నారు. రూ.15 కోట్లతో నిర్మిస్తున్న ఇందుర్తి-సుందరగిరి, ఇందుర్తి-హుస్నాబాద్ గ్రామాల రోడ్డు పనులను అయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నర్సయ్య, ఎంపిఓ శ్రావణ్ కుమార్, మహిళ సం ఘాల సభ్యులు, ఎన్‌హెచ్ శాఖ అధి కారులు, కాంట్రా క్టర్లు, మండల స్థాయి అధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, దుర్శేటి సంపత్ కుమార్, హుస్నాబాద్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ జేరి పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుర్తి- హుస్నాబాద్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

అధ్వానంగా ప్రభుత్వ పాఠశాల



పాఠశాలలో పైకప్పు లేని టాయిలెట్‌లు

- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- విద్యార్థుల ఇబ్బందులు

గన్నేరువరం, జనవరి 12: మండలంలోని ఖాసింపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అధ్వానంగా మారింది. అధికారుల పట్టింపు కరువై శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. తరగతి గదులకు కిటికీలు లేవు. పాఠశాలకు చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో రాత్రి వేళలో మందు బాబులు అడ్డాగా చేసుకుంటున్నారు. పాఠశాల ఆవరణలో మద్యాన్ని సేవించి సీసాలను పగులగొట్టి తరగతి గదుల్లో పడేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకుని పాఠశాలకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఖాసింపేట లోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల

పాఠశాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- గడ్డం సుమిత్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్, ఖాసింపేట

మా గ్రామంలోని పాఠశాల అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్షంతో అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారైంది. తరగతి గదుల్లో మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. పాఠశాలకు మరమ్మతులు చేపట్టి, ప్రహరీ నిర్మించాలని పలుమార్లు గ్రామపంచాయితి పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పాఠశాల మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.



కలెక్టరేట్ ఎదుట ట్రక్ డ్రైవర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట దర్నా చేస్తున్న డ్రైవర్లు

సుభాష్‌నగర్, జనవరి 12: మోదీ హటావో.డ్రైవర్స్ బచావో అని ట్రక్ డ్రైవర్లు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్-అండ్-రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడు తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత న్యాయ సంహిత చట్టంలో సెక్షన్ 106(1)(2) ప్రకారం డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్ష, ఏడు లక్షల జరిమానా విధించారని అన్నారు. ఈ చట్టాన్ని 2023లో డిసెంబరు 21న పార్ల మెంట్‌లో సవివరమైన చర్చ జరగకుండా చేసి ఆమోదింపచేశారని ఆరోపించారు. డిసెంబరు 25న ఆ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారని తెలిపారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పాత చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం డ్రైవర్లకు ఉరితాడులా మారిందన్నారు. ఈ విషయాన్ని గమనించి, సీఐటీయూ ఇతర రవాణారంగ ఫెడరేషన్లతో కలిసి ఈ నెల 17 నుంచి 25 వరకు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడ తామని హెచ్చరించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించడం వల్లే చట్టం రద్దు అవుతుందన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ము కుంద రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారి అధ్యయనం ప్రకారం 90 శాతం రోడ్డు ప్రమాదాలు మానవేతర కారణాలతో జరుగుతున్నాయని ఢిల్లీ ఐఐటీ రిపోర్టు ఇచ్చిందని తెలిపారు. కాంట్రాక్టర్లు నిబంధనలు విరుద్ధంగా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న రోడ్లలో జాతీయ రహదారులు ఉన్నవి కేవలం రెండు శాతం మాత్రమేనని, 62 శాతం రోడ్డు ప్రమాదాల్లో నిర్మాణం లోపం వల్లే జరుగుతున్నారని ఆరోపించారు. నేషనల్ పర్మిట్ ఉన్న వాహనాలకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిభందనల తొలగించారని ఆరో రించారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ 2019 మోటారు వాహనచట్టంలో భారీగా పెంచిన జరిమానాల వల్ల ప్రమాదాలు తగ్గలేదు సరికదా ప్రమాదాలు పెరిగాయన్నారు. ప్రమాదాలకు కారణాలు పరిశీలించకుండా శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయని అనడం సరికాదన్నారు. ప్రమాదం జరిగినపుడు గుడ్డిగా డ్రైవర్‌ను బాధ్యుడిని చేస్తూ చార్జిషీటు దాఖలవుతుందన్నారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) రద్దు చేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె ఆరిఫ్‌మహియోద్దీన్, ఇసుక టిప్పర్ డ్రైవర్లు, యూనియన్ నాయకులు శివ, శ్రీను, రెడీమెడ్ కాంక్రీట్ వాహన డ్రైవర్స్ నాయకులు రాంచంద్రన్, శ్రీనివాసచారి, దస్తగిరి, ఎండి షఫి, పవన్, మహేందర్, వెంకన్న, భద్రయ్య, సరేందర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసత్యపు ఆరోపణలు మానుకోవాలి

- ఆర్వోబీ పనుల్లో రాష్ట్ర నిధులు
- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 12: పార్లమెంట్ సభ్యుడిగా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి చేయాలనే ధ్యాస ఎలాగూ లేదు. నీవు చేయని పనులు చేసినట్లు, జరుగుతున్న పనులన్నీ కేంద్రం నిధులతోనే, నీ కృషితోనే అంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలంటూ నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను ఉద్దేశించి మాట్లాడారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి కేంద్రం నిధులు రూ. 155 కోట్లతోనే జరుగుతున్నాయని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా లేదంటూ ఎంపీ బండి సంజయ్ చేసిన వాఖ్యలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. మంత్రి గంగుల కమలాకర్, వినోద్‌కుమార్ ఎలాగైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తీగలగుట్టపల్లి గ్రామపంచాయతీని మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయించడంతో కార్పొరేషన్ పరిధిలోకి రావడంతోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేశారని అన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి 155 కోట్ల రూపాయల కేంద్రం నిధులతోనే ఆర్వోబీ చేపడుతున్నామని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా కూడా లేదంటూ వాఖ్యానించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 26 కోట్లు తమ వాటా నిధులను కేటాయించిందంటూ అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను మీడియాకు చూపించారు. అవాస్తవాలను ప్రజలకు తెలుపడాన్ని ఖండిస్తున్నామనిచెప్పారు. ఆనాటి మంత్రి గంగుల కమలాకర్, వినోద్‌కుమార్ దూరదృష్టితో తీగలగుట్టపల్లిని కార్పొరేషన్‌లో కలుపడం వల్లనే ఆర్వోబి వచ్చిందని అన్నారు. సంబంధం లేని స్మార్ట్‌సిటీ, హన్మకొండ రహదారిని తెచ్చామని చెప్పుకోవడం సరికాదన్నారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం మానుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సానుకూలత తెలపాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 12: రిజర్వేషన్ల వర్గీకరణ అంశాన్ని ఈ నెల17న సుప్రీంకోర్టులో విచారించబోతున్నందున రాష్ట్ర ప్రభు త్వం పక్షాన సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు సానుకూలత తెల పాలని ఎమ్మెల్యేలు సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాన కొండూరు నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావులు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయ న నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారా యణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పక్షాన బలంగా వాదనలు వినిపించేలా అనుభవజ్ఞులైన న్యాయవాదిని నియమించా లని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

గణేశ్‌నగర్, జనవరి 12: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నెహ్రూయువ కేంద్రంలో, జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి హాజరై మాట్లాడారు. నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ కార్యాలయంలో ఎంపీ మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం ఆధ్యాత్మిక విలువలను చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు. మహా రాష్ట్ర నాసిక్ జరుగుతున్న 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నెహ్రూయువ కేంద్రంలో వీక్షించారు.



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీ

- కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ చికాగోలో ప్రపంచ మతాల సమ్మేళనంలో స్వామి వివేకానంద చేసిన ఉపన్యాసం ఇండియా యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. యువతరాన్ని ఉత్తేజపరిచి వారిలో స్ఫూర్తి నింపిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అన్నారు. లేవండి, మేల్కొనండి, మీ లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి అనే ఆయన పిలుపు ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. వివేకానంద ఇచ్చిన సందేశాలు యువతకు అనుసరణీయమన్నారు. లింగ సమానత్వం పాటించి అమ్మాయిలు, అబ్బాయిలు బాగా చదవి దేశానికి, సమాజానికి ఉపయోగపడాలని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతరం చేతుల్లోనే ఉందన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, మెమెుం టోలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ వెంకట రాంబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, డీఆర్‌డీఏ శ్రీలత, జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నేతనియల్, డీటీడబ్ల్యూఓ జనార్దన్, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్,జనవరి12: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్1,2,3,4, శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం బీ.సి. స్టడీ సర్కిల్ నూతన భవనము, కరీంనగర్ కార్యాలయంలో ఆఫీసు వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా.. పదిమందికి గాయాలు

మంథనిరూరల్, జనవరి 12: మంథని-ఖమ్మంపల్లి ప్రధాన రహదారి గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తారం మండలం సీతంపల్లికి చెందిన నూనేటి రామయ్య తన ఆటోలో భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచ ప్రయాణికులకు తీసుకొని మంథని వైపు వస్తుండగా ఆటో ఆదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ రామయ్యతో పాటు ప్రయాణిస్తున్న 10 మందికి తీవ్ర గాయాలు కాగావారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఎడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, గోదావరిఖనికి తరలించారు.

ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. మేడిపల్లి సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద బుల్లెట్, మరో బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మంచిర్యాల జిల్లా మందమర్రి(జీలకుంట)కి చెందిన మొలిశెట్టి మహేందర్, ఎల్కలపల్లికి చెందిన అతుకుల సాయిరాం, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

వెల్గటూర్, జనవరి 12: జగిత్యాల జిల్లాలో వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గట్ల లచ్చయ్య (62) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లచ్చయ్య కొద్ది రోజుల క్రితం అయ్యప్ప మాల వేసుకున్నాడు. ఈ నెల 7న వెల్గటూర్‌లో గౌరి వెంకట చైతన్య ఏర్పాటు చేసిన అల్పాహారానికి వెళ్లిన లచ్చయ్య మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలో కల్వర్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన కండ్లె కృష్ణ (38) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ దత్తాత్రి కథనం ప్రకారం బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ తన భార్య గంగజలతో కలిసి జీవనోపాధి నిమిత్తం తుమ్మెనాల తల్లి ఇంటికి వచ్చారు. అక్కడే సమీపంలో గల గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. కృష్ణ మూర్ఛతో బాధ పడుతున్నాడు. ఈ నెల 1న నేరెళ్ల సమీపంలో గల కల్వర్టుపైన కూర్చొని ఉండగా హఠాత్తుగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తున్న బీజేపీ

- రాజకీయం కోసమే అయోధ్య రామమందిర నిర్మాణం

- మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

హుజూరాబాద్, జనవరి 12: సామాజిక రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం బీజేపీ భారత ప్రజలను మతాలుగా విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తోందని తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట శుక్రవారం ఒక ప్రకటన వెలువడింది. రాజకీయ దురుద్దేశ్యంతోనే ఆర్ఎస్ఎస్, బీజేపీ అయోధ్య రామమందిర నిర్మాణం చేపట్టిందన్నారు. 500ఏళ్ల కిందట ముస్లింలు పవిత్రంగా విశ్వసించే బాబ్రీ మసీద్‌ను నిర్మించుకొని వాళ్ల విశ్వాసాల ప్రకారం ప్రార్థనలు చేస్తూ వస్తున్నారన్నారు. కానీ రాముడు జన్మించిన స్థలం అంటూ కట్టు కథలు సృష్టించి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బ్రాహ్మణీయ, హిందుత్వ పాసిస్టు సంస్థలు 1992, డిసెంబరు 6న బాబ్రీ మసీద్‌ను బలవంతంగా కూల్చి వేశారన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో సుప్రీంకోర్టులో చారిత్రాత్మక వాస్తవాలను కప్పి పుచ్చి తీర్పు ఇప్పించారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో 2024 సాధారణ ఎన్నికల్లో మూడో విడత అధికారాన్ని చేపట్టడానికి రామమందిరాన్ని వాడుకుంటున్నారన్నారు. 2047నాటికి పరిపూర్ణ హిందుత్వ రాజ్యంగా మార్చాలనే ప్రధాన లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తుందన్నారు. మతతత్వ రామమందిర ఆవిష్కరణను ప్రజలు వ్యతిరేకించాలని లేఖలో పేర్కొన్నారు.

17క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- రైస్‌మిల్లులో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు
- యజమానిపై ఆగ్రహం

ఇల్లందకుంట, జనవరి 12: అక్రమంగా తరలిస్తున్న 17క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇల్లందకుంట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే వ్యక్తి ఉదయం ఎడ్లబండిపై కొత్తపల్లి నుంచి ఇల్లందకుంట వైపు తీసుకు వస్తుండగా గమనించిన పోలీసులు దాన్ని వెంబడించారు. ఆ ఎడ్లబండి ఇల్లందకుంటలోని సీతారామాంజనేయ రైస్‌మిల్‌లోకి చేరింది. ఎస్సై రాజకుమార్ వెంటనే సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ (ఓఎస్‌డీ) అధికారుల బృందం మిల్లుకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. మిల్లు యజమాని అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులపై అగ్రహం వ్యక్తం చేశారు. మిల్లులో స్టాక్ రిజిస్టర్, స్టాంపులు కూడా సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సదరు మిల్లు యజమాని 2021-22 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 10 లారీల వడ్లు పట్టించి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు పంపించకపోవడంపై మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన వడ్లు లేకపోవడంపై మండిపడ్డారు. 2022-23 సంబంధించిన బియ్యం కూడా ప్రభుత్వానికి అప్పగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపించిన బియ్యం కూడా క్వాలిటీగా లేవని, నెల రోజుల్లోగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం పంపించాలని చెప్పారు. లేని యెడల మిల్‌ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. గతంలో పంపించిన 290 క్వింటాళ్ల బియ్యాన్ని కూడా వాపస్ పంపిస్తే అవి కూడా మిల్లులో లేకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న బియ్యాన్ని నమూనాలు సేకరించి ల్యాబ్ పంపిస్తామని చెప్పారు. అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు రిపోర్టు రాస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయి ఓఎస్‌డీ ప్రభాకర్, సివిల్ సప్లయా ఎన్‌ఫోర్స్ మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, డీఎం రజినీకాంత్, డీసీఎస్‌వో సురేష్‌రెడ్డి, డీటీసీ, ఎస్ఐ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కూడారై ఉత్సవం



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల, జనవరి 12 : పట్టణంలో అతిపురాతనమైన శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవం (ఇత్తడి గంగాళంలో ప్రసాదం) ఘనంగా జరిగింది. అదేవిధంగా తిరుప్పావై ఉత్సవం అర్చనలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బీర్నంది నరసింహాచారి, ఈఓ విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, అండాల్ గోష్టి బృందం పాల్గొన్నారు.

జమ్మికుంట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష తులసి కుంకుమార్చన చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో ట్రక్కు బీభత్సం

- బస్టాండ్ వద్ద ట్రాలీని ఢీకొట్టి హోటల్‌లోకి..
- ట్రాలీ, ద్విచక్ర వాహనం ధ్వంసం
- ఒకరికి స్వల్ప గాయాలు



ట్రాలీని ఢీకొట్టిన ట్రక్కు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖనిలో శుక్రవారం తెల్లవారు జామున ట్రక్కు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో కాగజ్‌నగర్‌కు వెళుతున్న ట్రక్కు (టీఎస్07యూపీ0198) గోదావరిఖని బస్టాండ్ వద్ద అదుపు తప్పి మున్సిపల్ చెత్త ట్రాలీని ఢీకొట్టింది. అక్కడే టీ స్టాళ్ల వద్ద ఉన్న ప్రజలు అప్రమత్తమయ్యారు. శబ్దంతో లోపలికి పరుగులు తీశారు. ఆటో ట్రాలీని తోసుకుంటూ వేగంగా ట్రక్కు బస్టాండ్ ముందున్న టీ స్టాల్‌లోకి దూసుకుపోయింది. మున్సిపల్ ఆటో డ్రైవర్ ట్రాలీలోనే ఉన్నాడు. ఆటో ట్రాలీ, మరో మోపెడ్, సైకిల్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్రాలీ డ్రైవర్ మున్సిపల్ కార్మికుడు రమేష్ ట్రాలీలోనే చిక్కుకోవడంతో స్థానికులు అతన్ని బయటకు తీశారు. స్వల్ప గాయలతో అతను బయట పడ్డాడు. ఈ ఘటనతో భయకంపితులై ప్రయాణికులు పరుగు పెట్టారు. డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ స్వామి, ఏఎస్ఐ మల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, నాయకులు కాల్వ శ్రీనివాస్, పీచర శ్రీనివాస్ పరిశీలించారు.

ఎన్టీపీసీలో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. పీటీఎస్‌లోని రింక్ కోర్టులో జరిగిన పోటీలను కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దయానంద్ గాంధి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి బానేశ్వర్ రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన పలువురు చిన్నారులు రోలర్ స్కేటింగ్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పిల్లలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి

- కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ గుప్తా



మల్కాపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అజయ్ గుప్తా, కలెక్టర్ అనురాగ్ జయంతి

కోనరావుపేట, జనవరి 12: అర్హులైన ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వికసిత్ సంకల్ప యాత్ర కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో శుక్రవారం వికసిత్ సంకల్ప్ యాత్రను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ ద్వారా వ్యవసాయం ఎలా చేయాలనే అంశంపై ప్రత్యక్షంగా డ్రోన్ ద్వారా వరి పొలాలపై పిచికారి చేస్తుండగా ఆయన కలెక్టర్‌తో కలిసి తిలకించారు. అనంతరం అజయ్ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎలాంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మంది ప్రయోజనాలు పొందారు, ఎంతమందికి అందాయి అని తెలుసుకోవడం కోసమే ఈ యాత్రను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలా అందుతున్నాయోనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో రవీందర్, రామకృష్ణ సర్పంచ్ ఆరే లత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కాగా రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు సాయంత్రం తిరుగు పయాణమయ్యారు. కాగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని కేంద్ర టెక్స్‌టైల్ వంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక దర్శనం అనంతరం మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వ దించగా ఆలయ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్ స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మద్యం మత్తులో ఎస్సైపై బీజేపీ నేత దురుసు ప్రవర్తన

జ్యోతినగర్, జనవరి 12: మద్యం మత్తులో సప్ప నాగరాజు అనే బీజేపీ నాయకుడు ట్రాఫిక్ ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు దూషించిన సంఘటన గురువారం సాయంత్రం మేడిపల్లి సెంటర్‌లో జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ టి.ఉదయ్ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సప్ప నాగరాజు, మేకల నారాయణలపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటరులో రామగుండం ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తన సిబ్బంతో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న నాగరాజు, నారాయణలను ట్రాఫిక్ పోలీసులు ఆపారు. బ్రీత్ ఎనలైజర్‌లో ఊదాలని బైక్ నడుపుతున్న నాగరాజుకు పోలీసులు చెప్పినప్పటికీ నిరాకరించాడు. ఈ క్రమంలో ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌తో పాటు డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ సిబ్బందపై నాగరాజు, నారాయణలు దురుసుగా వ్యవహరిస్తూ దూషించారు. ఈక్రమంలో సంఘటన స్థలానికి వచ్చిన ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ బీజేపీ నాయకుడు నాగరాజు, నారాయణలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనపై దురుసుగా ప్రవర్తించడం, దూషించడంతో పాటు తన విధి నిర్వహణను ఆటంకపరిచాడని ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఎన్టీపీసీ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. నాగరాజు, నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీవన్ తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు అప్‌లోడ్ చేసిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, జనవరి 12: చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్ అకౌంట్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ చైల్డ్‌పోర్న్ వీడియోస్ డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశాడు. హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసు వారి సమాచారం మేరకు రజాక్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ అప్‌లోడ్ చేసినా, షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లెల్లలో చైన్ స్నాచింగ్

తంగళ్లపల్లి, జనవరి 12: మండలంలోని జిల్లెల్లలో చైన్ స్నాచింగ్ జరిగింది. జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోచవ్వ అసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని జంట ద్విచక్ర వాహనంపై పోచవ్వకు లిఫ్ట్ ఇచ్చారు. పోచవ్వ ఇల్లు గ్రామ శివారులో ఉండగా మధ్యలో రేషన్‌షాప్ వద్దకు రాగానే బియ్యం తీసుకు వెళ్లాలి ఇక్కడే దింపేయమని కోరింది. వాహనం దింపివేసి ఒక్కసారిగా పోశవ్వ మెడలోని గొలుసును లాగేసుకొని మల్లాపూర్ వైపు పారిపోయినట్లు బాధితురాలు పోచవ్వ తెలిపింది. సుమారు మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకు వెళ్లినట్లు తెలిపింది. మల్లాపూర్ రేణుకా ఆలయం వద్ద సీసీ కెమెరాలో ద్విచక్ర వాహనంపై ఉన్న జంట కదలికలు రికార్డు అయినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోచవ్వ తెలిపింది.

కవులు సామాజిక నిర్మాతలు



పురస్కారం అందుకున్న తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 12: ప్రజాపక్షం వహించే కవులు నవసమాజ నిర్మాతలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024కుగాను అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారాన్ని కవయిత్రి తోట నిర్మలారాణికి ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, అలిశెట్టి ప్రభాకర్ సతీమణి భాగ్యలక్ష్మి చేతులమీదుగా ప్రదానం చేశారు. తెవరే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, కవులు అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అలిశెట్టి సంగ్రామ్, దామరకుంట శంకరయ్య, పీఎస్ రవీంద్ర, వెగ్గలం ఉషశ్రీ, కందుకూరి అంజయ్య, రామానుజం సుజాత, శ్రీనివాస్, పత్తెం వసంత, సరసిజ, నడిమెట్ల రామయ్య పాల్గొన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం

కరీంనగర్ క్రైం, జనవరి 12: హాంగ్‌కాంగ్ పంపిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కరీంనగర్‌లోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన మినహాజ్ అలీ, రఫిక్‌అలంపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గాజుల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు ఆంజనేయులు, మరో వ్యక్తితో కలిసి 2023న అక్టోబరులో కార్ఖనగడ్డలోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ మినహాజ్ అలీ వద్దకు వెళ్లారు. హాంగ్‌కాంగ్‌కు వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ. 1.30 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఈ మేరకు ఆంజనేయులు రూ.1.10 లక్షలు, రాయుడు రూ. 1.20 లక్షలు ఇచ్చారు. మరో ఇద్దరిని కూడా హాంగ్‌కాంగ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు.

రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే చీరలకు వేలం

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు సమర్పించే చీరల వేలం పాటను ఆలయ సమావేశ మందిరంలో ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెండర్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో మూడు టెండర్లు రాగా, ముగ్గురు కాంట్రాక్టర్లు వేలం పాటకు హాజరయ్యారు. గత వేలం పాటలో ఈ కాంట్రాక్ట్‌ను రూ. 78 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు. నూతనంగా 2024-26కు గాను టెండర్ నిర్వహించగా స్వామివారి పాటగా రూ. 83 లక్షలతో అధికారులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రూ 95 లక్షల వరకు వేలంపాట పాడి అక్కడికి నిలిచిపోయారు. తరువాత ఆన్‌లైన్ టెండర్లను తెరిచిన అధికారులు సిద్ధార్థ అనే కాంట్రాక్టర్ రూ. కోటి 1 లక్ష 116లకు కోట్ చేయడంతో టెండర్ సిద్ధార్థ అనే కాంట్రాక్టర్ కు ప్రకటించారు. కరోనా సమయంలో టెండర్‌కు ఇప్పటికి రూ. 18 లక్షల తేడా ఉండటంతో కాంట్రాక్టర్లు పెద్దఎత్తున సిండికేట్ అయినట్లు ఆరోపణలు బాహాటంగానే వినబడుతున్నాయి. అమ్మవారి చీరల వేలం పాట సుమారు ఒక కోటి 30 లక్షల వరకు పలుకుతుందని భావించగా, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి వేలం పాటను ఒక కోటి ఒక లక్ష రూపాయలకే పరిమితం చేశారని చర్చసాగుతుంది. అధికారుల కనుసైగల్లోనే కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా మారినట్లు ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ. 2 లక్షల వరకు చేతులు మారాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా అనుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యామని, శాఖపరమైన విచారణ చేస్తామని అన్నారు. తిరిగి టెండర్ నిర్వహిస్తే కోటి దాటి మరింత ఆధాయం సమకూరే అవకాశం ఉందని ఆలయ వర్గాల్లో గట్టి వాదనలు వినిపిస్తున్నాయి.



వేలపాటకు హాజరయిన అధికారులు, కాంట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 12: మండలంలోని ఎలబాక గ్రామ శివారులో మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వేగురుపల్లి సమీపంలోని మానేరు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ యాజమాని కొమిరె ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 12: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 11 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి మూడు రోజులు జైలుశిక్ష, 2,500 రూపాయల జరిమానా, మరో 10 మంది వాహనదారులకు 18,500 రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

బోయినపల్లి, జనవరి 12: మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కనకయ్య (47) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల కనకయ్య కుటుంబం ఉపాధి కోసం కరీంనగర్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. కనకయ్య నీలోజిపల్లిలో గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి కొంత మేరకు అప్పు కావడంతో ఉపాధి కోసం కొద్ది నెలలుగా భార్యతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో కనకయ్య మద్యానికి బానిస అయ్యాడు. అప్పు తీర్చే మార్గం లేక మనోవేదన చెందుతుండేవాడు. గురువారం కరీంనగర్ నుంచి నీలోజిపల్లికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12: మండలంలోని రంగరావుపేట గ్రామానికి చెందిన గంగుల సామిల్(32) అను వ్యక్తి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానిక చెందిన గంగుల సామిల్ కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగలేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడు సామిల్ తండ్రి గంగుల నరేష్ ఫిర్యాదు మేరకు కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 12: కరీంనగర్ బస్టాండ్ రోడ్‌లోని తెలంగాణ మెడికల్ షాపు పక్కన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 45-50 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడు ధరించిన టీషర్ట్‌పై ఇండిగో పెయింట్స్ అని రాసిఉందని, గుర్తుపట్టిన వారు వన్‌టౌన్ సీఐ 8712670761, 9908440822లకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత..ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి12: కొత్తపల్లి మండల కేంద్రం, రేకుర్తిలలో కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి, ఈఎస్ శ్రీనివాసరావు, ఏఇఎస్ తాతాజీల ఆదేశాల మేరకు ఉదయం 10గంటల రేకుర్తి, కొత్తపల్లి గ్రామాలలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా గొల్లపల్లి మండలం నంచెర్లకు చెందిన రంగు వినయ్, కిసాన్‌నగర్‌కు చెందిన యాదగిరిలు గంజాయితో పట్టుబడ్డారు. కొత్తపల్లికి చెందిన ఉపేందర్ పరారీ అయ్యాడు. ఇద్దరు నిందితుల వద్ద 1,726 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయికి అలవాటు పడిన ఆరుగురు వియోగదారులను కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బైండోవర్ కోసం అప్పగించారు. ఈ దాడులలో ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూ క్రాస్‌కు చేరిన పందెం కోడి



పందెం కోడిని అప్పగిస్తున్న అధికారులు

భగత్‌నగర్, జనవరి 12: ఆర్టీసీ బస్సులో దొరికిన పందెం కోడి బ్లూక్రాస్ చేరింది. ఆర్టీసీ అధికారులు ముందుగా శుక్రవారం బహిరంగవేలం నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ కమిటీ నిర్ణయం మేరకు వేలం రద్దు చేశారు. అనంతరం ఆ పందెం కోడిని బ్లూక్రాస్ సొసైటీ జంతు సంరక్షణ ఇన్‌చార్జి తూం నారాయణకు కోడిని అందజేశారు.

కొడుకు మోసగించాడని సీపీని ఆశ్రయించిన రిటైర్డ్ కార్మికుడు

- కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖని టుటౌన్‌లో పని చేస్తున్న అర్నకొండ సదానందం అనే కానిస్టేబుల్‌పై శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అయిన తండ్రికి మాయమాటలు చెప్పి మోసగించి ఆస్తులు తన పేర గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడనే ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. బస్టాండ్ కాలనీలో నివాసముండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అర్నకొండ అంజయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, పెద్ద కుమారుడు మరణించగా రెండవ కుమారుడు సింగరేణిలో పని చేస్తున్నాడు. మూడవ కుమారుడు సదానందం కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బస్టాండ్ క్వార్టర్ల సమీపంలో అంజయ్య పేర ఉన్న ఇల్లు, స్వగ్రామం సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరులోని రెండు ఎకరాల వ్యవసాయ భూమి చిన్న కుమారుడు సదానందం గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, తనను నమ్మించి మోసగించి గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, అప్పటి నుంచి తనను వేధిస్తున్నట్టు బాధితుడు పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు సదానందంపై ఐపీసీ 420, 384, 506, 24ఆఫ్ మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటీజన్ యాక్ట్ 2007 ప్రకారం ఎస్ఐ సమ్మయ్య కేసు నమోదు చేశారు.

వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చేరాలు

జమ్మికుంట, జనవరి 12: సాంకేతిక నైపుణ్యాన్ని వ్యవసాయంలో ఉపయోగించి నూతన ఆవిష్కరణలు తీసుకు వచ్చి రైతులకు వివరించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మాజీ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి చేరాలు అన్నారు. పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శుక్రవారం మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జాతీయ యువత దినోత్సవం, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను రైతులకు సులభ రీతిలో అర్థం చేయించాలన్నారు. తద్వార అధిక దిగుబడులు, రాబడులు సాధించి ఆర్థిక, సామాజిక, శాస్త్రీయ పరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇప్పుడున్న ఉన్న యువత సాంకేతికంగా చాల చురుకుగా ఉన్నారని చెప్పారు. వారి నైపుణ్యం రైతుల పురోభివృద్ధికి తోడు కావాలని కోరారు. యవత దేశ పరంగా బాధ్యత యువతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్, శాస్త్రవేత్తలు డాక్టర్ మహేష్, డి శ్రీనివాస్, జె విజయ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కవిరాజ్, వంశీ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం

మెట్‌పల్లి, జనవరి, 12: పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులోని కోదండరామాల యంలో స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంప తులు, కమిటీ నిర్వహకులు మహాజన్ నరసింహులు దంపతులు వైభంగా జరిపిం చారు. తిరుప్పావై ధరూర్ మాస మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయం లోని స్వామి వారికి పురోహితులు రమాకాంత్ బృందం ప్రత్యేక అభిషేకాలు, పూ జలు, హారతి వంటి తదిర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ఆర్మూర్ పోచ య్య, సుతారి బుచ్చిరాజు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం పురోహితులు ఘనంగా జరిపారు. శుక్రవారం ఆలయంలోని ఉత్సవ మూర్తులకు పురోహితులు పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపి హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య గోదాదేవి రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి మండలంలోని పలు గ్రామాల్లోని భక్త లు పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

వైభవంగా కూడారై వేడుక



విద్యానగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 12: ధనుర్మాసోత్సవాల్లో శుక్రవారం ఆలయాల్లో, శ్రీవైష్ణవ సాంప్రదాయపరుల గృహాల్లో కూడారై వేడుక ఘనంగా నిర్వహించారు. వావిలాలపల్లి రామాలయంలో అధ్యక్షుడు మేచినేని అశోక్‌రావు, కార్పొరేటర్ మేచినేని వనజ పాల్గొన్నారు. సప్తగిరికాలని కోదండ రామాలయంలో ఆలయ ఛైర్మన్ గౌతమరావు పాల్గొన్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, ఈఓ నాగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో గోదాగోష్ఠి ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు. భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మేయర్ సతీమణి అపర్ణ, ఈఓ కొన్న కాంతారెడ్డి పాల్గొన్నారు. విద్యానగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అధ్యక్షుడు శ్రీరాం భద్రయ్య పాల్గొన్నారు. వేదభవనం, అండాళ్‌గోష్ఠిలో జరిగిన వేడుకల్లో వికాసతరంగిణి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీపురంలో గోదా రంగనాథ కల్యాణాన్ని నిర్వహించారు.

పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్త వహించాలి

గణేశ్‌నగర్, జనవరి12: సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్త వహించాలని ఎన్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్‌లు ఉన్న చోట గాలి పటాలు ఎగురవేయకూడదన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పతంగులు పడితే తీసుకునే ప్రయత్నం చేయకూడదన్నారు. ఇంటి డాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర పతంగులు ఎట్టి పరిస్థితిలో ఎగురవేయకూడదన్నారు. ఏమైనా ప్రమాదాలు జరిగితే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియచేయాలని కోరారు. వినియోగదారులందరు ఎప్పటికప్పుడు విద్యుత్ పట్ల అప్రమతంగా ఉండాలని, పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ట్రినిటి విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ట్రినిటి ఛైర్మన్ ప్రశాంత్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12: సిద్దిపేట జిల్లా కొండపాకలో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థి ఎ.రోహిత్ ఎంపికయ్యాడు. ఇటీవల ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఆయన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యాడని కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్‌ను ట్రినిటి కళాశాలల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె సంపత్ అభినందించారు.

ముగ్గుల పోటీలు

కరీంనగర్ టౌన్, జనవరి 12: నగరంలోని వైశ్యభవన్‌లో వైశ్య సేవా కేంద్రం, పట్టణ ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు చక్కటి స్పందన లభించింది. 100 మందికి పైగా మహిళలు పాల్గొని ముగ్గుల ద్వారా వారిలోని కళా నైపుణ్యాన్ని చాటారని సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, పట్టణ సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్ అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు పోలా స్ఫూర్తి, ఎల్లంకి రజిత, యాంసాని శ్రావణిలకు నగదు బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్ చంద్రశేఖర్, పట్టణ మహిళా కోశాధికారి రోహిణి నేతృత్వంలో నిర్వహించారు.

●స్థానిక హనుమాన్‌నగర్‌లోని బతుకమ్మ గద్దె వద్ద శుక్రవారం పదవ డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేత లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లలితాదేవి, న్యాయ వాది రేణుక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ అధ్యక్షుడు సుభాష్, శివ, పాపయ్య, ప్రభాకర్, రాజేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ప్రమీల

గంగాధర, జనవరి 12: విద్యార్థులు లక్ష్యం ఏర్పరుచుకుని క్రమశిక్షణతో చదవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల అన్నారు. శుక్రవారం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమానికి ఏఆర్ అకాడమీ ఛైర్మన్ లక్ష్మణ్ విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలన్నారు. ఉత్తమ ఫలితాలు పొందేందుకు ఇప్పటి నుండే క్రమశిక్షణతో చదవాలన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేవిధంగా బోధించాలని సూచించారు. చవివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కందుగులలో అక్షింతల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, జనవరి 12: మండలంలోని కందుగులలో అయోధ్య రామ పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పానుగంటి కిరణ్, కొండం రాజిరెడ్డి, సంది శ్రీధర్‌రెడ్డి, సంది కోమల్‌రెడ్డి, ముప్పు మహేష్, అక్కిపెల్లి జనార్దన్, బండ మొగిళి తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద చెత్త డంపింగ్

● జాతర ప్రాంతాల్లో నెలకొన్న అపరిశుభ్రత



సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద చెత్త డంపింగ్ చేస్తున్న సిబ్బంది

హుజూరాబాద్, జనవరి 12: హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద హుజూరాబాద్ మున్సిపాలిటీ సిబ్బంది చెత్త వేస్తున్నారు. వచ్చే నెలలో సమక్క-సారలమ్మ జాతర జరగనుండ టంతో అపరిశుభ్రత నెలకొననుంది. పట్టణంలోని చెత్తను తీసుకెళ్లి, కొత్తపల్లి గుట్టల్లో కేటాయించిన స్థలంలో వేయాల్సి ఉండగా, గద్దెల వద్ద మున్సిపాలిటీ చెత్త వేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ స్పం దించి గద్దెల వద్ద చెత్త వేయకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి







కరీంనగర్‌లో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ సునీల్‌రావు, జమ్మికుంటలో పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు, రాచపల్లిలో..

గణేశ్‌నగర్, జనవరి 12: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, స్వామి వివేకానందకు పూల మాలవేసి ఘన నివాళి అర్పించారు. ఉదయం శివ థియేటర్ సమీపంలోని చౌరస్తావద్ద జరిగిన కార్యకమంలో పాల్గొన్న బండి సంజయ్ యువతీ యువకులకు యువ సేవా పురస్కార్ అవార్డులను అందజేశారు. ఆర్టీసీ బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న నెహ్రూ యువజన కేంద్రం కార్యాలయంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

●జ్యోతినగర్‌లోని శివ థియేటర్ ముందు తెలంగాణ యువజన సమితి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి కరీంనగర్ నగర మేయర్ సునీల్‌రావు పూల మాల వేసి అనంతరం జిల్లాలో విశిష్ట సేవలు అందించిన యువతకు యువసేవ పురస్కార్ -2024 అవార్డు లను ప్రదానం చేశారు. యువసేవ పురస్కార్ అవార్డు కమిటీ ఛైర్మన్ చల్ల హరిశంకర్, జిల్లా కన్వీనర్ వొడ్నాల రాజు మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను పలు దిశల వ్యాపింప జేసిన మహా పురుషుడు స్వామి వివేకా నందుడు అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షులు సత్తినేని శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వొడ్నాల రాజు, కో కన్వీనర్ లోనే నాగరాజు, యువజన విభాగం ప్రతినిధులు అభిషేక్ గౌడ్, తోడేంగ హరీష్ యాదవ్, దానబోయిన మధు, జెల్లోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత రాపోలు గోపి కృష్ణ, కచ్చు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

●ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో జ్యోతినగర్ లో గల వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శాతవాహన యూనివర్సిటీ గ్రౌండ్‌లో క్రీడలు అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ క్షేత్ర సంఘటన మంత్రి రామ్మోహన్, జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాల్యాల రాకేష్ , అజయ్ పాల్గొన్నారు.

●విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వ ర్యంలో జ్యోతినగర్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షుడు ఇనుగుర్తి రమేష్, బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ కన్నం శంకర్ పాల్గొన్నారు.

●బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో వివేకా నంద విగ్రహానికి నివాళులర్పించారు

●**హుజూరాబాద్:** పట్టణంలోని స్వామి వివేకానంద జయంతిని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●**జమ్మికుంట రూరల్:** జమ్మికుంటలో స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ నాయకులు నివా ళులు అర్పించారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయం తిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ రాజశేఖర్, కో-ఆర్డినేటర్ ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**ఇల్లందకుంట:** మండలంలోని రాచపల్లి గ్రామంలో వేముల నరేందర్ సౌజన్యంతో రూ. 60వేలతో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందుడి విగ్రహాన్ని సర్పంచ్ ఆదిలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎనగంటి మహేందర్, బూస అశోక్, రాజిరెడ్డి, మోహన్‌రావు, మల్లేశం, రామకృష్ణ, లాల్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

●**సైదాపూర్:** మండలంలోని లస్మన్నపల్లిలో స్వామి వివేకానంద విగ్రహానికి ఎస్సై జన్ను ఆరోగ్యం పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌కాయిత రాములు పాల్గొన్నారు.

●**రామడుగు:** మండలంలోని వెదిర ఎక్స్‌రోడ్ వద్ద వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్, ఎంపీటీసీ అనిల్ కుమార్, తహసీల్దార్ బత్తుల భాస్కర్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షుక్రుద్దీన్, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు రేండ్ల కళింగ శేఖర్, అలువాల విష్ణు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

●**చొప్పదండి:** చొప్పదండిలో స్వామి వివేకానంద విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ అప్పనపల్లి విజయలక్ష్మి, గడ్డం చుక్కారెడ్డి, వడ్లూరి గంగరాజు, వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి రాజన్నల సాగర్ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●**గంగాధర:** మండలంలోని మర్రిగడ్డలో వివేకానంద స్వామి విగ్రహానికి పూల మాలవేసి యువత నివాళులర్పించారు.

●**గన్నేరువరం:** మండల కేంద్రంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో వేడు కలు నిర్వహించారు. ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, తహసీల్దారు భిక్షపతి హాజరై విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లెల లక్ష్మి లక్ష్మణ్, ఉపసర్పంచ్ బూర వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

●**మానకొండూర్:** మానకొండూర్‌లో బీజేపీ జి ల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్క రాచారి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

●**తిమ్మాపూర్:** మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ మేడి అంజయ్య, ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

కరీంనగర్ కల్చరల్, జనవరి12: కోరా జాన్సన్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపు కున్నారు. విద్యార్థులు వివిధ రకాల రంగవల్లులు వేసారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోరా జాన్సన్ పాఠశాలలో వేడుకలు



వింధ్యావాలి పాఠశాలలో..

●కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠ శాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

●హౌజింగ్‌బోర్డ్ కాలనీలోని రిషి ద ప్లే స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఛైర్మన్ చెన్నప్ప, ఇంచార్జ్ కౌశల్ పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ ఛైర్మన్ ఆర్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: రేకుర్తిలోని పారడైజ్ పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహిం చారు. పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి పాతిమారెడ్డి హాజరై ప్రారం భించారు. విద్యార్థులు, తల్లులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల రంగవల్లులను ఆవిష్కరించారు. అనంతరం బహు మతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసంత, మధు, శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జి సంధ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గులు, పతంగి పోటీలను నిర్వ హించి విజేతలకు కళాశాల ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల పారమిత వరల్డ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ ప్రసాదరావు, డైరెక్టర్ ప్రసాద్, ప్రసూన, అనుకర్‌రావు, వినోద్‌రావు, రాకేష్, ప్రిన్సిపాల్ శ్రీకర్, సమన్వయకర్త నాగరాజు పాల్గొన్నారు.

●హుజూరాబాద్ రూరల్: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ ఆక్టివిటి సెంటర్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

18 నుంచి రెండో విడత వెబ్ ఆప్షన్స్

తిమ్మాపూర్, జనవరి 12: డీఈఈసెట్-2023లో ఉత్తీర్ణులై ఇప్పటికే ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన పూర్తయిన అభ్యర్థులు రెండో విడతలో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సంబంధిత వెబ్ సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపిక

తిమ్మాపూర్, జనవరి 12: శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ-2004బ్యాచ్ నలుగురు విద్యార్థులు హైదారాబాద్‌కు చెందిన హెచ్‌డీ ఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 4.75లక్షల రూపాయల వార్షిక వేతనం లభించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డితో పాటు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీడీసీ ఇన్‌చార్జి టి వినయ్ అభినందించారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకులు?

వీణవంక, జనవరి 12: మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. మండలానికి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు, పది మంది సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి చర్చించినట్లు సమా చారం. సంక్రాంతి పండుగ తర్వాత కాంగ్రెస్ పార్టీలో పెద్ద సంఖ్యలో చేరేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది.

రక్తదానం

రామడుగు, జనవరి 12: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా రామడుగు మండల కేంద్రంలో శ్రీ వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు రామకృష్ణ, పరశురా మ్ గౌడ్, వీరయ్య, రాజు, నవీన్‌కుమార్, శ్రీను, శ్రీకాంత్, మనోజ్, శంకర్, సాయి, కిరణ్, భరత్, శ్రీసాయి పాల్గొని రక్తదానం చేశారు.

అర్చకుడు ఆకస్మిక మృతి

తిమ్మాపూర్, జనవరి12: తిమ్మాపూర్ మండల కేంద్రంలో నివాసం ఉండే అర్చకుడు అచి వేణుగోపాల చార్యులు(70)శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న పురాతన శ్రీరాముల వారి ఆలయంలో వేణుగోపాలచార్యులు పౌరోహిత్యం చేస్తున్నారు. ఆలయా నికి సంబంధించిన కొంత భూమిపై వివాదం కొనసాగుతోంది. శుక్రవారం కూడా కొందరు నాయకులు, గ్రామస్థుల సమక్షంలో ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలోనే అర్చకుడికి మొత్తం చెమటలు వస్తుండటంతో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో వారు గుర్తించి కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకువెళ్తుండగానే మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. భూవివాదంతోనే అర్చకుడు గుండెపోటుకి కారణమై మృతి చెందాడనే గ్రామంలో చర్చ జరుగుతోంది.

మానసాదేవి ఆలయానికి భక్తుడి విరాళం

గన్నేరువరం, జనవరి 12, మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి సింగిరెడ్డి శ్రీకర్‌రెడ్డి-శ్రీజ, లక్ష్మారెడ్డి-భాగ్యలక్ష్మి దంపతులు శుక్రవారం ఆలయకమిటీకి 63వేల నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్ననర్సింహారెడ్డి, ఆలయకమిటీ ఛైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు నాగసాయిశర్మ పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంకాగాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 12: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రి యాంకాగాంధీ జన్మదిన వేడుకలు నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవా రం ఘనంగా జరుపుకు న్నారు. కేక్ కట్ చేసిన అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ ప్రియాంకా గాంధీ రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖమ్రొద్దీన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడి రమేష్, తమ్మడి ఎజ్రా, మ్యాకల నర్సయ్య, పెద్దిగారి తిరుపతి, జ్యోతిరెడ్డి, మహమ్మద్ భారీ, బషీర్, మంది మహేష్, సలిమొద్దీన్, మాసుం భాయ్, వంగల విద్యా సాగర్, మామిడి సత్యనారాయణరెడ్డి, షానవాజ్, నదీమ్, ముదిగొండ మనోహర్, కుమార్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, లావణ్య, పుష్పలత, సంపత్, విజేందర్, లక్ష్మి, రాధ, కాజీపేట శ్రీనివాస్, బిక్షపతి, ఇంద్రసేనారెడ్డి, కిరణ్‌రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, వెంకటరెడ్డి, ఖలీల్, సదానందం, శ్రీనివాస్, రియాజ్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



వీరభద్రస్వామి ఆలయం

గంగాధర, జనవరి 12: కోట్ల వీరభద్రస్వామి ఉత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కోట్ల నర్సింహుల పల్లిలో సుప్రసిద్ధ మహిమాన్విత దివ్య మందిరాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమైంది. నందరాజుల ఏలుబడిలో చోళుల కాలం నుంచి అద్భుత శిల్పకళకు సజీవ సాక్ష్యాలు శ్రీ వీరభద్ర స్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి, ద్వికుటాలయం, ఈశాన్య మున శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలకు తెలంగాణ వ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. 14న గంగాజల సేకరణ, ధ్వజశోభాయాత్ర, మంటప ప్రవేశం, గణ పతిపూజ, అఖండా దీపారధన నిర్వహించనున్నా రు. 15న కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, పల్లకి సేవా చేపడుతారు. 16న రుద్రహోమం, నవగ్రహహోమం, గణపతి హోమం, విశేష కుంకుమ పూజ, రథోత్సవం, బలిహరణ, బండ్ల ప్రదక్షిణలు నిర్వహి స్తారు. 17న శ్రీభద్రకాళి పూజ, సుంకు, శివకళ్యాణం, నందికోల సేవ, 18న అగ్నిగుండాలు, శ్రీవీరభద్ర స్వా మి వారికి అన్నపూజతో ఉత్సవాలు ముగియ నున్నాయని గ్రామస్థులు చెప్పారు. ఉత్సవాలకు వ చ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లను చేసినట్లు సర్పంచ్ తోట కవితామల్లారెడ్డి తెలిపారు.

ఇద్దరు సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, జనవరి 12 : కరీంనగర్ స్పెషల్‌బ్రాంచి సీఐ-2గా పనిచేస్తున్న కే.సృజన్‌రెడ్డిని స్పెషల్‌బ్రాంచి సీఐ-1గా బదిలీ చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల సీఐగా పనిచేస్తున్న బిల్ల కోటేశ్వర్‌రావును కరీంనగర్ స్పెషల్ బ్రాంచి సీఐ-2గా బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

స్నేహితుడు కుటుంబానికి చేయూత

జమ్మికుంట రూరల్, జనవరి 12: జమ్మికుంట పట్టణా నికి చెందిన వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో 1995-96లో అతడితో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.63వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

హుజూరాబాద్ లీగల్, జనవరి 12: హుజూరాబాద్ కోర్టులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మహిళా కోర్టు సిబ్బంది పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, రెండో అదనపు మెజిస్ట్రేట్ స్వాతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మానకొండూర్, జనవరి 12: మండలంలోని మానకొం డూర్, చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం వి ద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు ఫసీ అహ్మెద్, ఎం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపా రు. చెంజర్ల, కొండపల్కల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంట ల వరకు మానకొండూర్, లింగాపూర్, వెల్ది సబ్‌స్టేషన్ ప రిధిలోని గ్రామాలలో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సా యంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

అల్ఫోర్స్ విద్యార్థికి అభినందన

రామడుగు, జనవరి 12: రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన వి శ్రీచరణ్ ఈ నెల 3న మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్-17 పోటల్లో పాల్గొన్నా డు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పరిచయ సభ

కరీంనగర్ కల్చరల్, జనవరి 12: భవానీ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఫిలింభవన్‌లో లేదాళ్ల రాజేశ్వర రావు రచించిన 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' పుస్తక పరిచయ సభను నిర్వహించారు. పుస్తకాన్ని తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధనరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నవరం దేవేందర్, సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, గోపగాని రవీందర్, నూటెంకి రవీంద్ర, ధాస్యం సేనాధిపతి మాట్లాడారు. అన్నాడి గజేందర్‌రెడ్డి, వైరాగ్యం ప్రభాకర్, తడిగొప్పుల కుమారస్వామి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12: క్రీడలతో స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం, పటేల్ యూత్ ఫోర్సుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పటేల్ క్రికెట్ లీగ్ ట్రోఫీ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ మాట్లాడుతూ మున్నూరు కాపులలో స్నేహభావం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఇంజనీర్ కోల అన్నారెడ్డి, గంగాధర జడ్పీటీసీ పుల్కం నర్సయ్య, మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, జనవరి 12: కరీంనగర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొమ్మకల్‌కు చెందిన మహమ్మద్ షానవాజ్‌ను నియమిస్తూ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాహుల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ శుక్రవారం షాన వాజ్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా యూత్ కాంగ్రెస్ పక్షాన ప్రజలతో మమేకమై, యువత సమస్యలను పరిష్కరించడం పట్ల బాధ్యతను నిర్వర్తిస్తా నని షానవాజ్ తెలిపారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి 12: జన విజ్ఞాన వేదిక-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు-2024 గోడపత్రికను శుక్రవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్‌రవు మాట్లాడుతూ ఈ నెల 19న పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాలబాలికల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం, వారిలో ప్రవేశించే స్వభావాన్ని పెంచి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించే విధంగా తీర్చిదిద్దడం కోసం జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

21న పారమితలో విజ్‌కిడ్ టాలెంట్ టెస్ట్

కరీంనగర్ టౌన్, జనవరి12: నగరంలోని పద్మనగర్‌లో గల పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఈ నెల 21న ఉదయం 10 నుంచి 11:30 గంటలకు విజ్‌కిడ్ టాలెంట్ రివార్డ్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పారమిత విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున 2 లక్షల 40 వేల రూపాయల పారితోషికం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. మరింత సమాచారం 8106292424 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అల్పాహారం పంపిణీ

సుభాష్‌నగర్, జనవరి 12: సామాజిక సమరసత వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా ఆసుపత్రిలోని పేషంట్లకు వారి బంధువులకు ఉదయం అల్పాహారం అందించారు. ఈ కార్యక్ర మంలో పుల్లూరి రమారావు, రాజేందర్‌రెడ్డి, మధుసూదన్ రావు, నర్సింగం, శ్యామ్, జగన్, పురుషోత్తం, దావు సంతోష్ కుమార్, మహిళ విభాగం బాధ్యులు సంధ్యరమాదేవి, వినోద పాల్గొన్నారు.

కోడిని డీర్‌పార్క్‌కు అప్పగించాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 12 : రెండు రోజుల కిందట ఆర్టీసీ బస్‌లో దొరికిన కోడిని వేలం వేయకుండా డీర్ పార్క్‌కు అప్పగించాలని కరీంనగర్ జీవకారుణ్య సమితి కార్యదర్శి జి కొమురయ్య కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.